సాక్షి గుంటూరు

శనివారం । 14 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.9865 టీఎంసీలు. ఎగువ నుంచి 1,945 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4,200 వదులుతున్నారు.




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1216 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వీటిని వేర్వేరు కాల్వలకు పంపిణీ చేశారు.

జీరో కరోనా

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



న్యూస్‌రీల్

ఆర్టీసీ, రైల్వేస్టేషన్లలో ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ తనిఖీ



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ శుక్రవారం రాత్రి గుంటూరు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఏయే ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అధిక సంఖ్యలో ఉన్నారు, వారి రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేసిన బస్‌ల రాకపోకలు వివరాలను ఆర్టీసీ అధికారులు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా హైదరాబాద్, తిరుపతి, వైజాగ్, బెంగళూరు తదితర పట్టణాల వైపు వెళ్లే ప్లాట్‌ఫాంల వద్ద వచ్చే, పోయే బస్‌ల వివరాలను తెలియజేశారు. ఎవరెవరూ వెళ్తున్నారు, ఏ పట్టణాలకు వెళ్తున్నారంటూ ప్రయాణికులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గుంటూరు, పల్నాడు వైపు వెళ్లే ప్లాట్‌ఫాంలపై కలియ తిరిగారు. పోలీస్ ఔట్‌పోస్ట్ (ఓపీ) పోలీస్‌స్టేషన్ ను పరిశీలించారు. ఓపీలో ఎంత మంది విధుల్లో ఉంటున్నారనేది తూర్పు డీఎస్పీ సీతారామయ్య ఎస్పీకి వివరించారు. అనంతరం గుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లి గుంటూరు నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లే రైళ్ల వివరాలను రైల్వేస్టేషన్ అధికారులు ఎస్పీకి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రద్దీ వేళల్లో ప్రయాణికులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో రైళ్లు, ఆర్టీసీ బస్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైల్వేస్టేషన్‌లో, ఆర్టీసీ బస్టాండ్‌లో దిగే ప్రయాణికులతో మంచి మెలగాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఏ ఒక్కరూ వద్ద అధిక చార్జీలు వసూలు చేయవద్దన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శ్రీనివాసరావు (క్రైం), తూర్పు డీఎస్పీ సీతారామయ్య, కొత్తపేట పీఎస్ సీఐ శ్రీనివాసుల రెడ్డి, సీసీఎస్ సీఐలు వెంకన్న చౌదరి, బెల్లం శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ నరసింహ, తూర్పు ట్రాఫిక్ సీఐ ఇస్సార్ బాషా, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్టును శుక్రవారం విడుదల చేశారు. ఫైనల్ మెరిట్ లిస్టును ఈనెల7న విడుదల చేయగా, 40 మంది అభ్యర్థులు వివిధ అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, తిరిగి ఫైనల్ మెరిట్ లిస్టును శుక్రవారం విడుదల చేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్టును సీఎఫ్‌డబ్ల్యూ వెబ్‌సైట్‌లో చూడాలని ఇన్‌చార్జ్ ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ తెలిపారు.

వైద్యులకు నియామక ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 11 మంది ఎంబీబీఎస్ వైద్యులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపు ఉత్తర్వులు జారీచేసినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె. హనుమంతురావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 575.50 అడుగుల వద్ద ఉంది. ఇది 270.3735 టీఎంసీలకు సమానం. కుడికాలువకి 8,067, ఎడమకాలువకు 6,634, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 17,304, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 34,725 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 23,119 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 850.00 అడుగుల వద్ద ఉంది. ఇది 79.9890 టీఎంసీలకు సమానం.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1500, గరిష్ట ధర రూ.2200, మోడల్ ధర రూ.1700 వరకు పలికింది.

పల్లెగూటికి పండగొచ్చింది

- అంతటా సంక్రాంతి శోభ...
- బంధువుల రాకతో తెలుగు లోగిళ్లు కళకళ
- సంబరాల్లో మంత్రి రజిని

తెనాలి: పుష్యం మంచు తెరలు ఇంకా విడిపోనేలేదు...తూరుపుపొద్దున సూరీడు బద్ధకంగా ఒళ్లు విరుస్తున్నాడు. తెలుగు లోగిళ్లు మాత్రం అప్పటికే ముగ్గులతో మెరుస్తున్నాయి. మధ్యన గొబ్బెమ్మలు తమను చూడమన్నట్టు కనిపిస్తున్నాయి. ఇది ధనుర్మాసంలో కనిపించే దృశ్యం.. ఊరి కంటే ముందు వాకిలి మెలకువ తెచ్చుకుంటుంది. గోమయంతో నిండారా స్నానం చేసి పచ్చటి కాంతులీనుతుంది. ముచ్చటైన ముగ్గులతో ముస్తాబై, పసుపు కుంకుమలను అద్దుకుని, గొబ్బెమ్మలు ఆభరణాలుగా అందరినీ పలకరిస్తుంటాయి. 'హరిలోరంగ హరి' అంటూ హరిదాసులు, 'అయ్యవారికి దండమెట్టూ' అంటూ దూడూ బసవన్నలు పొద్దున్నుంచి ఊరిని చుట్టేస్తారు. ఈ అద్భుతమంతా సంక్రాంతి శోభదే సుమా!

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించేదీ, ఉత్తరాయ పుణ్యకాలంలోకి అడుగిడేదీ సంక్రాంతి రోజే. పురాతన పరంపరం నుంచి కొత్తదనానికి పరిణితి చెందటమే సంక్రమణం. అన్ని పండుగలకు చాంద్రమానం ఆధారం అయితే, సంక్రాంతికి సౌరమానం ఆధారం. ఈ మాసంలో సూర్యుడు ఉత్తరాయణ పథంలోకి పయనమవుతాడు. అందుకే దీన్ని ఉత్తరాయణ పుణ్యకాలం అని పిలుస్తారు. సంక్రాంతి మూడురోజుల పండుగ.

తొలిరోజున భోగి. మర్నాడు సంక్రాంతి, తర్వాతిరోజు కనుమ జరుపుకుంటారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యపు రాశులు ఇంటికి చేరాక వచ్చే తొలి పండుగ. రైతులు, రైతుకూలీలు సంతోషంగా ఉంటారు. ఎక్కడెక్కడో ఉండే కుటుంబసభ్యులు, బంధుమిత్రులు తప్పనిసరిగా వస్తారు.

కొత్త అల్లుళ్లకు ఉన్నంతలో రాచమర్యాదలు జరిగే సందర్భమిది. ఉత్తరాయణ పుణ్యకాలం పితృదేవతలకి ఆరాధనా కాలం. ప్రతీ సంక్రమణకీ పితృదేవతలకి తర్పణాలు ఇవ్వాలి. మిగిలిన 11 సంక్రమణలకు ఇచ్చినా ఇవ్వకున్నా మకర సంక్రమణం రోజున తప్పకుండా ఇవ్వాలి. ఆరోజున ముఖ్యంగా అరిసెలు చేస్తారు. అరిసెలు పితృదేవతలకు ఏడాదికి సరిపడా భక్ష్యమని అంటారు.



సంక్రాంతి అనగానే కళకళలాడే పల్లెలే కనుల ముందు నిలుస్తాయి. రంగు రంగుల రంగవల్లులు... గాలి పటాలు...కోడి పందేలు.. గంగిరెద్దు మేళాలు.. బుడబుక్కలవారు.. హరిదాసులు..జంగమదేవరలు... ప్రకృతితో సహజీవనం చేసే అసలైన పండుగ సంక్రాంతి. కొత్త పంటలతో, వంటలతో పరిమళిస్తుంది. అనుబంధాలు, ఆత్మీయతల్ని పెంచే పండుగల్లో ముఖ్యమైంది సంక్రాంతి. సంక్రాంతి పెద్ద పండుగ మాత్రమే కాదు... పెద్దల పండుగ కూడా!

కో ఢీ

కోస్తా జిల్లాల్లో కోడి పందేలు లేని సంక్రాంతిని ఊహించలేం. ఆంక్షలున్నా, మన సంస్కృతి, సంప్రదాయంలో భాగమైన కోడిపందేలు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతూనే వస్తున్నాయి. ఈ పండక్కి పతంగుల ఎగరేయటం కూడా రివాజు. పండుగ రోజుల్లో పిల్లలు గాలిపటాలు ఎగరేస్తూ బిజీగా ఉంటారు. ఇలా సంక్రాంతి పండుగ ఏడాది పొడవునా అందరికీ మధురానుభూతుల్ని మూటగడుతుంది.





చిలకలూరిపేటలో భోగి మంటను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని



హరిదాసు సందడి

తిండి వంటలు



సంక్రాంతికి తగ్గట్టే షడ్రుచుల విందు భోజనాలు తప్పనిసరి. సంప్రదాయ పిండివంటలు సంక్రాంతిలో భాగం. వారం పదిరోజుల ముందు నుంచే పిండి వంటల హడావుడి కనిపిస్తుంది. పల్లెల్లో ఎటుతిరిగి వంటకాల తయారీ బాగానే ఉంటోంది. అరిసెలు, బూరెలు, కారప్పూస, చెక్కలు, పూర్ణాలు, బొబ్బట్లు, లడ్డు, కజ్జికాయలు, బూందీ..వంటి వంటకాలు తయారీలో ఉంటారు.

భోగి భాగ్యాలు

ఏడాది పొడవునా కష్టపడిన రైతు, పండిన పంటతో ఆనందంగా అందరితో రాజభోగాలు అనుభవించే పండు గ అయినందున దీనిని 'భోగి' అని వ్యవహరిస్తున్నారు. దక్షిణాయణంలో చివరి రోజు ఇది. పండిన పంటను పనివారు, యాచకులు, పశుపక్ష్యాదులకు వితరణ చేయటం రాజభోగం. పాత వ్యవస్థలోని చెడును మంటల్లో కాల్చి, సజీవతత్వాన్ని గ్రహించి, గుణాత్మక పరివర్తన చేయడం కోసం భోగిమంటలు. ముంగిట్లో, వీధి మలుపుల్లో వేసే భోగిమంటల్లో పాత వస్తువులను వేస్తారు. అంటే చెడును వదిలించుకుని మంచికి శ్రీకారం చుట్టటం. ఆరోగ్యం, ఆయువు, శాంతి, ఆనందం కలగటానికి ఈ పండుగ చేసుకుంటారు. సాయంత్రం చిన్న పిల్లలున్న ఇళ్లలో భోగి పళ్ల కార్యక్రమం సంప్రదాయం. రేగుపళ్లలో సౌరశక్తి ఉంటుంది. ఈ శక్తిని పిల్లలకు అందించాలని పెద్దలు తలపెట్టిన పండగ ఇది. భోగిరోజున కొన్ని ప్రాంతాల్లో కన్నెపిల్లలు గొబ్బి గౌరి వ్రతం చేస్తారు. ఇంట్లో మండపం చేసి, పళ్లు, కూరగాయలు, చెరకు గడలు, పూలతో అలంకరిస్తారు. మధ్యలో కొత్త బియ్యం పోసి బంక మట్టితో చేసిన గౌరీదేవిని ఉంచుతారు. పాలతో చేసిన పొంగలిని నైవేద్యంగా పెడతారు.

గొబ్బియల్లో.. గొబ్బియల్లో..

సంక్రాంతి పండక్కి రంగవల్లులను ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. చదువు, ఉద్యోగం, వ్యాపారాల్లో రాణిస్తూ బిజీగా ఉంటున్న ఆధునిక మహిళలు ఆచారాలకు విలువిస్తున్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ప్రతి ఇంటా ముగ్గులు కొలువు దీరతాయి. ముగ్గుల్లో గొబ్బెమ్మలు తప్పనిసరి. నెలమొత్తం పెట్టిన గొబ్బెమ్మ ముద్దలను పిడకలు చేసి ఎండబెడతారు. వాటిని దండ గుచ్చి భోగిరోజు మంటల్లో వేస్తారు. సంక్రాంతిరోజు పెట్టిన గొబ్బెమ్మల్ని ఎండబెట్టి దాచి రథసప్తమి రోజు సూర్యుడి ఎదుట పెట్టి వెలిగిస్తారు. ఆ పిడకలపైనే పరమాన్నం చేసి సూర్యభగవానుడికి నైవేద్యం సమర్పిస్తారు. పిడకల్ని భోగిమంటల్లో వేస్తే పిల్లలకు దిష్టి తగలదని నమ్మకం.





పశువులకు పూజలు

సంక్రాంతి మర్నాడు కనుమ. ఏడాదంతా శ్రమించిన మూగజీవాలకు రైతులు తమ రుణం తీర్చుకునే రోజు. పశువులకు కృతజ్ఞతగా పసుపు కుంకుమలతో పూజిస్తారు. పశుపక్ష్యాదుల కోసం ఇంటి గుమ్మానికి ధాన్యం కంకులు కడతారు. వివిధ నైవేద్యాలు చేసి గ్రామదేవతలను పూజిస్తారు. కనుమకు మినుములు తినాలని నానుడి. అందుకే గారెలు చేస్తారు. ఒంటికి వేడి సమకూరుతుంది.

రైతన్నకు యాంత్రీకరణ దన్ను

- ఇప్పటికే 135 ట్రాక్టర్ల పంపిణీ
- ఇప్పటి వరకు ఐదు కోట్ల 16 లక్షల సబ్సిడీ
- మరో 75 ట్రాక్టర్ల పంపిణీకి రంగం సిద్ధం
- ప్రతి మండలానికి మూడు డ్రోన్లు...
- ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ



ట్రాక్టర్ల పంపిణీ సమయంలో ట్రైల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సాగు ప్రారంభం నుంచి పంట విక్రయం వరకు అన్ని విధాలుగా రైతులకు లాభాలు వచ్చే విధంగా సహకారాన్ని అందిస్తోంది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తీసుకువచ్చింది. పంట ఈ-క్రాప్ నమోదు, ఉత్పత్తులు మద్దతు ధరకే విక్రయించుకునే విధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. సాగులో ఖర్చులు తగ్గించేందుకు వ్యవసాయ యంత్ర పరికరాలను ఆర్‌బీకేల ద్వారా రైతు గ్రూపులు ఏర్పాటు చేసి 40 శాతం సబ్సిడీతో తొలిదశలో పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటావేటర్లు, గడ్డికట్టే యంత్రాలు, వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు అందజేశారు. సేద్యానికి భరోసాగా నిలుస్తోంది. గతంలో గ్రామాల్లో జన్మభూమి కమిటీలు చెబితేనే రైతులకు సబ్సిడీపై యంత్రాలు అందజేసింది. అప్పట్లో పలుకుబడి ఉన్న పెద్ద రైతులు సబ్సిడీ యంత్రాలను స్వాహా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రైతులే నిర్ణయాత్మక శక్తిగా పారదర్శకంగా పథకాల లబ్ధి చేకూర్చుతున్నారు. గత ఏడాది జూన్ ఏడున జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా పాల్గొని రైతులకు యంత్ర పరికరాలు అందచేశారు. అప్పుడు జిల్లా వ్యాప్తంగా 131 ట్రాక్టర్లు, ఆరు వరికోత యంత్రాలు పంపిణీ చేశారు. ఒక్కొక్క ట్రాక్టరు విలువ సుమారు రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఉన్నాయి. వీటికి సంబంధించి రైతులకు 5,16,82,000 రూపాయలు సబ్సిడీ కింద రైతులకు జమ చేశారు. ఈ సీజన్‌లో రైతులకు మరో 75 ట్రాక్టర్లు ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి ట్రాక్టర్ కంపెనీల ఎంపానల్‌మెంట్ ప్రక్రియ పూర్తి అయ్యింది. త్వరలో రాష్ట్ర స్థాయి కమిటీ ధరలను నిర్ణయించనుంది. రైతులు ఏం కావాలో ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. అర్హత ఉన్న రైతులు గ్రూపులుగా ఏర్పడి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుంటే ఎవరి సిఫార్సులు లేకుండా ఎటువంటి కమిటీలకు తావు లేకుండా, కేవలం అర్హతే ప్రామాణికంగా గ్రూపులను ఎంపిక చేసి ట్రాక్టర్లు ఇవ్వనున్నారు.

అర్హత ఉంటేనే ఎంపిక

అర్హత ఉన్న వారు ట్రాక్టర్లు, డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఎక్కడా ప్రలోభాలకు, సిఫారసులకు తావు లేకుండా చేస్తున్నాం. రైతులు ఏర్పాటు చేసుకున్న గ్రూపుల పరిస్థితిని పరిశీలించి, వారితో చర్చించిన తర్వాత రైతుల కోరిక మేరకే ట్రాక్టర్లు పంపిణీ చేస్తాం.

–నున్న వెంకటేశ్వర్లు,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి, గుంటూరు.

మండలానికి మూడు డ్రోన్లు


జిల్లాలో ప్రతి మండలానికి మూడు డ్రోన్ల చొప్పున 51 డ్రోన్లు పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేశారు. వీటిని కూడా 40 శాతం సబ్సిడీపై ఇవ్వనున్నారు. 8 నుంచి 10 లక్షల రూపాయల వరకు రుణం ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి ఐదుగురు రైతులు కలిపి ఒక గ్రూపుగా ఏర్పడాల్సి ఉంటుంది. అందులో ఒకరికి డ్రోన్ పైలెట్‌గా శిక్షణ ఇస్తారు. పైలెట్‌గా శిక్షణ పొందేవారు కనీసం ఇంటర్ చదివి, పాస్‌పోర్టు కలిగి ఉండాలి.

కోడిపందేలు వేయకుండా పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సంక్రాంతిని పురస్కరించుకుని జిల్లాలో కోడి పందేలు ఆడేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు కోడి పందాలు నివారించేందుకు ప్రత్యేక నిఘా కమిటీలు వేశామన్నారు. రెవెన్యూ, పోలీసు, స్థానిక సిబ్బందితోపాటు జంతు ప్రేమికుల సహకారంతో ఎక్కడైనా జరిగితే కఠినంగా వ్యవహరించాలన్నారు. నిఘా బృందాలు ఈ నెల 18వ తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. స్థానికులు కూడా తమకు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జేసీ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

మంత్రి అంబటి సంక్రాంతి శుభాకాంక్షలు



సత్తెనపల్లి: భోగ భాగ్యాలను ఇచ్చే భోగి, సరదా నిచ్చే సంక్రాంతి, కమ్మని కనుమ కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ కొత్త వెలుగులు నింపాలని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆకాంక్షించారు. పాడి పంటలతో రైతులు ఆనందంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి విడదల రజిని శుభాకాంక్షలు



చిలకలూరిపేట: జిల్లా ప్రజానీకానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి లోగిళ్లలో భోగి పండగ భాగ్యాలను తేవాలని ఆకాంక్షించారు. సంక్రాంతి నాడు అందరి ఇంటా సంక్రాంతి లక్ష్మీదేవి సిరులు కురిపించాలని కోరారు. కనుమ రోజు మూగజీవాలకు పూజలతో కర్షకులు పాడి పంటలతో తులతూగాలని శుభాశీస్సులు అందజేశారు.

పండుగలా కదిలొచ్చారు..

ఒక్కొక్కరుగా ఆ ప్రాంగణంలోకి అడుగుపెడుతుంటే.. అరవై ఏళ్ల నాటి తలపులు తుమ్మెద నాదమై గుండెల్లో సవ్వడి చేశాయి. మిత్రులను చూసిన ఆనందంలో కళ్లు కాంతి రేఖలై ఆ ప్రాంగణాన్ని ఇంద్రధనస్సులా మార్చాయి. బాగున్నావా అంటూ కలిసిన బాల్య స్నేహితుల కరాలు.. ఎన్నాళ్లకు ఈ భాగ్యమంటూ మరింతగా బిగుసుకున్నాయి. చదువులమ్మ ఒడిలో అలనాటి అల్లరి చేష్టలు మరుపురాని గురుతులై మదిని తడుతుంటే పెదవులపై చిక్కని చిరునవ్వుల మందారాలు విరబూశాయి. మిత్రుడి ఎదుగుదలే తన విజయంగా సంబరపడిన స్నేహ పరిమళాలు నేటి తరానికి స్వచ్ఛ సంకేతాలు పంపాయి. కాల గమనంలో వేరైన జీవితపు దారుల్లో బాధ్యతలు, బంధాలు వారి మాటల్లో తేనెల ఊటలయ్యాయి. బాల్యంలో ఒడిలోకి లాలనగా తీసుకుని అదిగో బంగారు జీవితమంటూ జ్ఞానాన్ని గోరుముద్దలు చేసి అందించిన గురువుల పాదాలకు విద్యా కుసుమాలు కృతజ్ఞతాభిషేకం చేశాయి. చివరకు ఆనందంతో నిండిన గుండెలు.. ఆప్యాయతల దారానికి కట్టిన అనుబంధాల మల్లెల సుమ గంధాలను దాచుకుని మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ కదిలి వెళ్లాయి.

నూతక్కిలో పూర్వ విద్యార్థుల సందడి



ఆత్మీయ కలయికలో 1988- 89 బ్యాచ్ విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న పూర్వ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: నూతక్కి అనపోతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమృతోత్సవాలు అంబరాన్ని అంటాయి. దేశవిదేశాల్లో స్థిరపడిన ప్రముఖులతో పాటు వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు జొన్నల ప్రసాదరెడ్డి, శివారెడ్డి మాస్టారు, నూతక్కి మాధవిలు జ్యోతి ప్రజ్వలన చేశారు. పాఠశాల చరిత్ర, సాధించిన ప్రగతిపై నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా జొన్నల ప్రసాదరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అనేక మందికి స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. అనేక మంది స్కూల్ అభివృద్ధిలో భాగస్వాములు అయినట్లు వివరించారు. శివారెడ్డి మాస్టారు మాట్లాడుతూ నాడు- నేడు కార్యక్రమంతో పాటు ఇతోధికంగా ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. పూర్వ విద్యార్థి, రెడ్డి ల్యాబ్స్ అధినేత ఆర్థిక సాయంతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆయన కుమారుడు సుమారు కోటి రూపాయల ఆర్థిక సాయంతో భవన నిర్మాణానికి సాయం అందించినట్లు పేర్కొన్నారు. స్కూల్ హెచ్ఎం రాజీవ్ రతన్ మాట్లాడుతూ పాఠశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనే అదృష్టం కలిగినందుకు ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్. వేణుగోపాలరెడ్డితో పాటు నూతక్కి మాధవి ప్రసంగించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. అదే విధంగా పూర్వ విద్యార్థుల సంఘంలో కీలక పాత్ర నిర్వహిస్తున్న శివారెడ్డి మాస్టారు, జొన్నల ప్రసాదరెడ్డిలను ఘనంగా సన్మానించారు. పలువురు పూర్వ విద్యార్థులు సైకిల్ స్టాండ్, వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఆర్థిక సాయం ప్రకటించడంతో వారిని కూడా సన్మానించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 226 పోస్టులు భర్తీ

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ ఎస్జీటీలను తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు చేపట్టిన కౌన్సెలింగ్‌కు విశేష స్పందన లభించింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఉన్నత పాఠశాలల్లో నెలకు రూ.2,500 టీచర్ అలవెన్సుపై పని చేసేందుకు ఉపాధ్యాయులు సుముఖత వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలో 226 ఉపాధ్యాయ పోస్టుల్లో సీనియర్ ఎస్జీటీలను నియమించారు. శుక్రవారం డీఈఓ పి.శైలజ అధ్యక్షతన జరిగిన కౌన్సెలింగ్ కు ఎస్జీటీలు హాజరయ్యారు. ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా నెలకు రూ.2,500 అలవెన్సుపై ఆయా పోస్టుల్లో పని చేసేందుకు అంగీకారం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు సంతకాలు చేశారు.

15న ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 15న ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.45 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య తెలిపారు. శుక్రవారం జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలోని కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు.సొసైటీ కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 15న కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor: APMDC | APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

97030 13015, 99126 71555

District sponsor: VIVA THE SCHOOL BY VVIT

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

21న జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలు



చిత్రకళా పోటీల పోస్టర్లు విడుదల చేస్తున్న లేళ్ల అప్పిరెడ్డి, మనోహర్ నాయుడు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 21న నిర్వహించనున్న జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలు, ఆర్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్లను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ సహకారంతో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల పోస్టర్లను బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆవిష్కరించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ చిత్రకారుల కళా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు చక్కటి వేదికగా చెప్పారు. క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ కేపీ బాబు మాట్లాడుతూ ఈనెల 21న సాయంత్రం 4.00 గంటలకు జాతీయస్థాయిలో చిత్రకళా ప్రదర్శన ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, వైసీపీ నాయకులు గులాం రసూల్, ఆర్టిస్ట్ మధు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు విద్యుత్ ఉద్యోగుల ఫిర్యాదు

పట్నంబజారు: విద్యుత్ శాఖ కార్యాలయం ఉద్యోగులు చేసుకున్న ఫిర్యాదులపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. పిడుగురాళ్లలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే సోమ్లానాయక్, జూనియర్ అసిస్టెంట్ ఎల్లాప్రగడ రామ్‌గోపాల్ ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో రామ్‌గోపాల్, సోమ్లానాయక్‌పై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రామ్‌గోపాల్ ఇచ్చిన మరో ఫిర్యాదుపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



పట్నంబజారు: వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్సలు పొంది ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన చెక్కుల్ని శుక్రవారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, కాపు కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు అడపా శేషు, డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు పంపిణీ చేశారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలువురికి రూ. 7.30 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఖాజామొహిద్దీన్ చిష్టి పాల్గొన్నారు.

చోరీ కేసుని ఛేదించిన హెచ్‌సీ, పీసీలకు ప్రశంసలు



నగరంపాలెం: కేసుల్ని ఛేదించేందుకు వేలిముద్రలు కీలకమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. ఇటీవల తెనాలిలో జరిగిన భారీ చోరీ కేసుని ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన వేలిముద్రల విభాగం (క్లూస్ టీం)ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) ఎం.శ్రీనివాస్, పీసీలు షంషుద్దీన్, రాము, శ్రీనివాస్‌కు ప్రశంస పత్రాల్ని అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

లిటిల్ స్టెప్స్ స్కూల్‌లో పేరెంట్స్ ఫన్ ఫెస్ట్



నగరంపాలెం: లిటిల్ స్టెప్స్ ఇంటర్నేషనల్ ప్రీస్కూల్‌లో శుక్రవారం పేరెంట్స్ ఫన్ ఫెస్ట్–2023 నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు రంగోలి, మ్యూజికల్ చైర్స్, యాక్షన్ గేమ్స్ తదితర క్రీడలలో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చలపతి సంస్థ డైరెక్టర్ వై.సుజిత్ కుమార్, పాఠశాల డైరెక్టర్ షాజహాన్, ప్రిన్సిపాల్ సంధ్య పాల్గొన్నారు.

చందనాలంకారంలో రంగనాథస్వామి



చేబ్రోలు: స్థానిక రంగనాథస్వామి దేవస్థానంలో స్వామి శుక్రవారం చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసం సందర్భంగా అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాల్ని ఘనంగా నిర్వహించారు. 20 కిలోల చందనంతో అలంకరించారు. గోదాదేవి అమ్మవారు ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాస పూజలు, తిరుప్పావై, సహస్ర తులసీ దళార్చన, చతుర్వేద పారాయణం, సామూహిక విష్ణు సహస్ర అర్చన, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

నేడు చిన్నారులకు సామూహిక భోగి పండ్లు

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో శనివారం చిన్నారులకు సామూహిక భోగి పండ్లు పోసే కార్యక్రమాన్ని నూతనంగా నిర్వహిస్తున్నట్లు ఏసీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3:45 గంటలలోపు తల్లిదండ్రులు చిన్నారుల్ని వెంట తీసుకొని ఆలయ ప్రాంగణానికి రావాలని ఆయన సూచించారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా రాష్ట్రం





సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

పట్నంబజారు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కార్యాలయంలో శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ సారథిగా, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ఆంధ్ర రాష్ట్రాన్ని యావత్తూ దేశం రోల్‌మోడల్‌గా తీసుకునేలా సీఎం జగన్ తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. అన్ని రంగాలకు ప్రాముఖ్యత కల్పిస్తూ, పరిపాలన అంటే ఎలా ఉండాలో చేసిన చూపెట్టారని తెలిపారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్ర ద్వారా తెలుసుకున్న ప్రతి సమస్యకు జగన్ అధికారంలోకి వచ్చాక పరిష్కారం చూపారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవే కాకుండా చెప్పని ఎన్నో పథకాల్నిసైతం ప్రజల దరి చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీని మరోమారు అధికారంలోకి తీసుకునివచ్చే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ పేదవర్గాల బాసటగా నిలుస్తూ , ఆరోగ్యశ్రీ , అమ్మఒడి, లక్షలాది మందికి ఇంటి స్థలాలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు అందజేసి, ఎన్నో గొప్ప పథకాలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని వివరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా విప్లవాత్మక పరిపాలన ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు తాడిశెట్టి మురళి, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు షరీఫ్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

అధికారుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, స్వచ్ఛ సర్వేక్షణ్, అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఉగాది నాటికి ప్రతి లేఅవుట్‌లో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని చెప్పారు. లే అవుట్ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



బహుమతులు ప్రదానం చేస్తున్న జేసీ రాజకుమారి, మేయర్ కావటి, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రెండో రోజు శుక్రవారం ఉదయం ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సంక్రాంతి శోభ, సంస్కృతీ, సంప్రదాయాల్ని నేటి తరానికి తెలియజెప్పడానికి ఇటువంటి సంబరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారు పాడిపంటలు, గంగిరెద్దులు వంటి తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ముగ్గులు వేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా 11, 12వ తేదీల్లో నగరపాలక సంస్థ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించామని తెలిపారు. 15వ తేదీ వరకు ప్రజలకు ఆహ్లాదకరంగా, ఉత్సాహభరితంగా ఉండేలా వివిధ విభాగాల్లో పోటీల్ని నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. 14, 15వ తేదీల్లో సినీ, టీవీ కళాకారులతో సంగీత విభావరి, కామెడీ స్కిట్ల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సంబరాలలో భాగంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. నిత్య జీవనంలో పండుగలు, సంబరాలు నూతన ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. అనంతరం ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, మహమ్మద్ అబిద్ బాషా, డెప్యూటీ కమిషనర్లు టి. వెంకట కృష్ణయ్య, బి. శ్రీనివాసరావు, ఈఈ సుందరరామిరెడ్డి, ఇంజినీరింగ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు మహిళల ఐక్యతకు నిదర్శనం

లేళ్ల అప్పిరెడ్డి



పోటీల్లో పాల్గొన్న మహిళలతో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తదితరులు

పట్నంబజారు: ముగ్గుల పోటీలు మన సంస్కృతీ, సంక్రాంతి పండుగకు ప్రతీకలని.. మహిళల ఐక్యతకు, ఆప్యాయతకు నిదర్శనమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది. కార్యాలయం ఎదుట రోడ్డును రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ముగ్గుల వెనుక సామాజిక, మానసిక, ఆరోగ్య, ఆధ్యాత్మికమైన అనేక కోణాలు దాగి ఉంటాయని తెలిపారు. తెలుగు వారి లోగిళ్లకు, ముగ్గులకు విడదీయరాని అవినాభావ సంబంధం నెలకొని ఉందని చెప్పారు. ముగ్గుల పోటీలకు విశేషంగా తరలి వచ్చి సృజనాత్మకతను చాటిచెప్పిన మహిళలకు అభినందనలు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మన తెలుగు మహిళల ముగ్గులకు విశేష పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని తెలిపారు. మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సాధారణంగా ముగ్గులతోనే ఏ పండుగకైనా ప్రత్యేక కళ వస్తుందని పేర్కొన్నారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మహిళల మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి, ఏకాగ్రతకు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పోటీల్లో ఫాతిమాపురానికి చెందిన దోరేపల్లి శివపార్వతి ప్రథమ, 45వ డివిజన్‌కు చెందిన పొత్తూరి అన్నపూర్ణ ద్వితీయ, భవనం హరిత తృతీయ స్థానాల్ని చేజిక్కించుకున్నారు. శనివారం ఎమ్మెల్సీ కార్యాలయంలో జరిగే సంక్రాంతి సంబరాల్లో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తారు. ప్రథమ బహుమతిగా రూ.10వేల విలువైన చీర, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 5వేలు, రూ. 3వేల చీరలు, పోటీలో పాల్గొన్న అందరికీ వెయ్యి రూపాయల విలువైన చీరలు బహుమతులుగా అందజేయనున్నట్లు పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, పార్టీ నేతలు గులాం రసూల్, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సంప్రదాయాల కొనసాగింపు అభినందనీయం

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత



విజేతలను సన్మానిస్తున్న పోలూరి, పక్కన న్యాయమూర్తులు

గుంటూరు లీగల్: సంక్రాంతి పండగ సందర్భంగా సంప్రదాయాల్ని కొనసాగిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎం.వెంకటేశమ్మ, నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎ.సునీత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోరంట్ల స్వాతి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్నశ్రీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. న్యాయమూర్తులు అన్ని ముగ్గులను పరిశీలించి విజేతల్ని ప్రకటించారు. మొత్తం ఎనిమిది మంది పాల్గొన్నారు. పాటిబండ్ల ఇంద్రజకు మొదటి బహుమతి, నాగకమల, ప్రత్యూషకు రెండో బహుమతుల్ని అందజేశారు. మిగిలిన వారికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జీబీఏ అధ్యక్షుడు పాలడుగు వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వేముల జయపాల్, లేడీ రిప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సిద్ద సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ తాడిశెట్టి వెంకట ఆనందరావు పాల్గొన్నారు.

విజేతలకు ప్రత్యేక సన్మానం

ముగ్గుల పోటీల్లో విజేతలు, పాల్గొన్న అందరికీ గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. జీబీఏ ఎన్నికల్లో ప్రెసిడెంట్ అభ్యర్థి కాసు వెంకటరెడ్డి, జీపీ పోకల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు బుడపాటి కిరణ్, సీడీ భగవాన్, ఏపీపీ వజ్రాల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపాలెం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

లేళ్ల అప్పిరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: నగర శివారు గ్రామమైన అంకిరెడ్డిపాలెం సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. అంకిరెడ్డిపాలెంలో ఆధునీకరణకు సిద్ధమైన శ్మశానవాటిక, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటుకు రూపొందించిన ప్రత్యేక ప్రణాళికల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్పొరేషన్‌అధికారులు, ఆర్కిటెక్చర్లు, స్థానిక పెద్దలతో సమీక్షించారు. అన్ని వసతులతో పాటు గ్రీనరీకి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి సుందరీకరణతో అందమైన పూదోటలా శ్మశానవాటికను తీర్చిదిద్దాలని చెప్పారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి ని ఆనుకుని గుంటూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న అంకిరెడ్డిపాలెం గ్రామంలో ఇప్పటికే ప లు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూలును ఆధునీకరించడంతో పాటు అదే ఆవరణలో జూనియర్ మహిళా కళాశాల ఏ ర్పాటు చేసినట్లు చెప్పారు. శ్మశానవాటికను మల్టీపర్పస్‌గా ఆధునీకరణపై దృష్టి సారించినట్లు వివరించారు. చెరువు చుట్టూ అందరికీ ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్యా మల వెంకటరమణ, ది చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్‌దిగుమతి సంఘం అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, మాజీ అధ్యక్షుడు కె. సాంబిరెడ్డి, పుల్లారెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, యర్రం సాంబిరెడ్డి, కార్పొరేషన్ ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, డీఈ కల్యాణరావు, ఆర్కిటెక్చర్లు సూరజ్, వానపల్లి, పార్టీ నేతలు నూనె ఉమామహేశ్వరరెడ్డి, పరిశపోగు శ్రీనివాసరావు, పానుగంటి చైతన్య పాల్గొన్నారు.

బాలానాం ఆహారం బలం

- బిడ్డ ఎదుగుదలకు సమీకృత ఆహారమే కీలకం
- పరిశుభ్రంగా ఉండేలా చూడాలి
- ఆరు నెలల పాటు తల్లిపాలు తప్పనిసరి




గుంటూరు మెడికల్: ప్రతిరోజూ గుంటూరు జీజీహెచ్‌కి ఐదుగురు చిన్నారుల్ని బరువు తక్కువగా పుట్టడంతో చికిత్స కోసం తీసుకొస్తున్నారు. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు పెరగడం లేదని పలువురు తల్లిదండ్రులు కంగారు పడిపోతున్నారు.అయితే, సరైన పౌష్టికాహారం పెట్టకపోవడం వల్లే పెరగడం లేదన్న విషయం వారు గమనించలేకపోతున్నారు. బరువు తక్కువగా ఉండటం వల్ల పిల్లలకు పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. సాధారణంగా గర్భంలో ఉండగానే తల్లి సమీకృత ఆహారం తీసుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్యవంతంగా పుడతాడు. అది సాధ్యం కానప్పుడు బిడ్డ పుట్టిన పిదప అందజేయడం ద్వారా ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. పుట్టినప్పటి నుంచి ఏఏ నెలలో ఎలాంటి ఆహారాన్ని పిల్లలకు పెట్టాలనే విషయాలను 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

తల్లిపాలు పట్టించడం తప్పనిసరి

నవజాత శిశు సంరక్షణ కోసం తప్పనిసరిగా బిడ్డ పుట్టిన వెంటనే ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లి పాలు మాత్రమే పట్టించాలి. నీరు, ఇతర పదార్థాలు ఇవ్వకూడదు. పిల్లలు ఎన్నిసార్లు తాగితే అన్నిసార్లు పాలు పట్టాలి. అస్వస్థతతో ఉన్నాసరే దీన్ని కొనసాగించాలి. వీలైనంత వరకు తల్లి కూర్చుని బిడ్డకు పట్టాలి. 6 నుంచి 12 నెలల వయస్సు ఉన్న శిశువులకు తల్లిపాలు కొనసాగించడం చాలా మంచిది. ఆ తర్వాత మెత్తగా చేసిన తృణ ధాన్యాలు, కిచిడి, పొంగలి, పప్పులు, పండ్లు, కూరగాయలు ఇవ్వాలి. క్రమక్రమంగా తినే ఆహారం మోతాదు పెంచాలి. పిల్లలకు ఆహారం అందించే ముందు తప్పనిసరిగా చేతుల్ని పరిశుభ్రం చేసుకోవాలి. అన్నం, చపాతి, కూరగాయలు, పసుపు రంగు పండ్లు, పప్పు దినుసులు, పాలతో చేసిన వివిధ రకాల ఆహార పదార్థాల్ని పిల్లలకు పెట్టాలి. ప్రత్యేకమైన కంచం, గిన్నె కేటాయించాలి. ఆహారం తినే ముందు, తిన్న తరువాత చేతుల్ని శుభ్రంగా కడుక్కోవడం పిల్లలకు నేర్పించాలి. రెండు సంవత్సరాలు పైబడిన పిల్లలకు రోజుకు ఐదు సార్లు ఆహారం తినిపించాలి. తరుచుగా పండ్లు, గుడ్లు, పాలు ఇవ్వాలి. పిల్లలకు సొంతంగా తినడం అలవాటు చేయాలి. వారు తినే పద్ధతి పరిశీలించాలి. చల్లటి పానీయాలు, ఐస్ క్రీమ్‌లు, చాక్లెట్లు ఎట్టి పరిస్థితుల్లో పెట్టకూడదు. బిడ్డ మూడో ఏట ఉన్నప్పుడు తన ఆహారం తనే తినేలా చూడాలి. తినేటప్పుడు ఆహారం గురించి ప్రశ్నలు అడగాలి. బాగా నమిలి తినడం నేర్పించాలి.

ఫాస్ట్‌ఫుడ్స్‌తో అనర్థాలు



గర్భిణి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడు. పుట్టిన పిదప కూడా తల్లి పౌష్టికాహారాన్ని తీసుకుంటూ పిల్లలకు కూడా పెట్టాలి. ఫాస్ట్‌ఫుడ్స్ అలవాటు చేస్తే అనేక అనర్థాలు తలెత్తడంతోపాటు పలు వ్యాధులు దరి చేరతాయి. ముఖ్యంగా ఊబకాయం బారిన పడడంతోపాటు, చిన్న వయస్సు లోనే బీపీ, షుగర్‌లు వస్తాయి.

–డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గోరంట్లలో నివసించే ఓ కుటుంబానికి చెందిన తల్లీ, కుమార్తె అమరావతి రోడ్డులోని ఓ దేవాలయానికి వచ్చారు. ఈ సమయంలో కుమార్తె తల్లికి సాకు చెప్పి గుడిలో నుంచి బయటకు వచ్చి ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెలాఖరు వరకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: కాటూరి సిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో జనవరి 31వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రమౌళీనగర్ బిషప్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆస్పత్రిలో బీపీ, హెచ్‌బీ, ఆర్బీఎస్, ఈసీజీ, కంప్లీట్ యూరిన్ వైద్య పరీక్షలు ప్రతిరోజూ ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. గుంటూరు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 0863– 2212399, 8500616365 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ అభినందనీయం



విద్యార్థులతో మురళీ వరప్రసాద్, దీపక్

గుంటూరు ఎడ్యుకేషన్ : గణిత శాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ ఆధ్వర్యంలో పండరీపురంలో నిర్వహిస్తున్న ఉచిత జేఈఈ, నీట్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం విశ్రాంత డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అందే మురళీ వరప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పుల్ని విద్యార్థులకు వివరించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. శిక్షకుడు దీపక్ మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువును సమాజానికి ఉపయోగపడే విధంగా మలచుకోవాలని, జీవితంలో లక్ష్యాన్ని చేరుకున్నాక తిరిగి సమాజాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వ్యతిరేకంగా ఫ్యాప్టో నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం. కళాధర్ మాట్లాడుతూ నెలకు రూ.2,500 అలవెన్సుతో ఉపాధ్యాయుల్ని నియమించడం అనేది గతంలో జరగలేదని, దీని వల్ల భవిష్యత్తులో ఉద్యోగోన్నతులు లేకుండా పోతాయని పేర్కొన్నారు. ఆర్థిక అనుమతులు, సర్వీసు నిబంధనలు లేకుండా చేపడుతున్న ఈ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ జి. రాజకుమారి, డీఈవో పి.శైలజకు వినతి పత్రాలు సమర్పించారు. నిరసన ప్రదర్శనలో ఫ్యాప్టో జిల్లా డెప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండీ. ఖాలీద్, నాయకులు మేకల సుబ్బారావు, కె. బసవ లింగారావు, జి.మోహనరావు, సీహెచ్. నరసింహారావు, పి. ప్రేమ్‌కుమార్, డి. పెదబాబు, ఎం. హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్



ఏఎన్‌యూలో ఓవరాల్ చాంపియన్ షిప్ షీల్డ్ కైవసం చేసుకున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ప్రభుత్వ మహిళా కళాశాల క్రీడాకారిణుల్ని ప్రిన్సిపాల్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో కళాశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కై వసం చేసుకున్నట్లు ఆమె శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించింది.

సాక్షి బిజినెస్
శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
303	98
60,261	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	10,978	▽	23
డోజోన్స్	34,193	▲	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,844	▲	50
డాక్స్	15,087	▲	28
షాంఘై	3,195	▲	31
నికాయ్	26,120	▽	330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
56,462	▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)		
56,236	▲	351
వెండి (కేజీ)		
68,115	▲	90

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	79.50	83.18
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	96.84	101.69
€	యూరో	ధామస్‌కుక్	85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)	ధామస్‌కుక్	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	54.20	59.09
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	59.21	63.76
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	21.25	23.04
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్లు దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్‌ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్,



నెస్లే, ఎల్అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.

స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తృతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.



ఇతర రంగాలకూ పీఎల్ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60 శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.



పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్ఎంఈలను జీవీసీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.



అమిత్ రోహిదాస్

8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.



హిమ్మత్

భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరోవైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.



సూర్య, ఇషాన్

న్యూజిలాండ్‌దే సిరీస్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.



భరత్

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.